# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 66 | శనివారం 08, నవంబర్ 2025 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com




# కేటీఆర్, కిషన్ రెడ్డి బ్యాడ్ బ్రదర్స్

వారివల్లే హైదరాబాద్ అభివృద్ధి ఆగింది

కాంగ్రెస్, టీడీపీ వల్లే హైదరాబాద్ డెవలప్‌మెంట్

2004–2014 మధ్య రాజధానిలో అనేక నిర్మాణాలు

ఆ తర్వాత స్థిరంగా నిలిచిపోయిన పనులు

బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసింది

ఆ అప్పుకు వడ్డీలు కట్ట డమే సరిపోతున్నది

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ప్రజాస్వరం

కేటీఆర్, కిషన్ రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి బ్యాడ్ బ్రదర్స్ అని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. వారివల్లే తెలంగాణ అభివృద్ధి, హైదరాబాద్ అభివృద్ధి ఆగిపోయిందని విమర్శించారు. 20042014 మధ్య కాలంలో రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే హైదరాబాద్ నగరం అత్యధికంగా అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మేజర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులే నగరాన్ని గ్లోబల్ హబ్‌గా మార్చాయని ఉద్ఘాటించారు. ఓఆర్ఆర్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, మెట్రో రైలు సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ''అవిభక్త రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్), రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (శంషాబాద్), హైదరాబాద్ మెట్రో రైలు వంటి కీలక ప్రాజెక్టులను తీసుకొచ్చింది. ఈ చొరవలు నగరాన్ని ఐటీ, ఫార్మా హబ్‌గా ఎలివేట్ చేశాయి'' అని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం మంజూరు చేసిన ఐటీఐఆర్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్)ను ఎన్‌డీఏ ప్రభుత్వం రద్దు చేసినందుకు ఆయన విమర్శలు గుప్పించారు. ''ఐటీఐఆర్ అమలు జరిగి ఉంటే రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి చెందేది'' అని అన్నారు.

**2014 తర్వాత 'శూన్యం': బీఆర్ఎస్, బీజేపీపై విరుచుకుపడ్డ సీఎం**

2014 నుంచి కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధికారంలో ఉన్నా హైదరాబాద్‌లో ఎలాంటి గణనీయ అభివృద్ధి జరగలేదని సీఎం ఆరోపించారు. ''2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉండగా, 2023 నాటికి బీఆర్ఎస్ నేతృత్వంలోని ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల అప్పులతో కాంగ్రెస్‌కు అప్పగించింది'' అని ఆయన డేటాను ఉటంకిస్తూ వివరించారు. బీఆర్ఎస్ హయాంలో మిగతా 2లో..

# వీధికుక్కలు కనిపించొద్దు

విద్యాసంస్థలు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్ల నుంచి తరలించండి

షెల్టర్లకు తరలించడం తప్పనిసరిగా చేయాలి

ఎనిమిది వారాల్లో చర్యలు పూర్తి చేయాలి

సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

న్యూ ఢిల్లీ, ప్రజాస్వరం:

వీధి కుక్కల సమస్యపై సుప్రీంకోర్టు శుక్రవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా విద్యాసంస్థలు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రాంగణాల పరిసరాల్లో తిరుగుతున్న వీధి కుక్కలను తక్షణమే షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. ఆ ప్రాంగణాల్లోకి మళ్లీ కుక్కలు ప్రవేశించకుండా రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. క్రమంతప్పకుండా తనిఖీలు జరిపి ఆ ప్రాంతాలు కుక్కల నుంచి స్వేచ్ఛగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించింది. పట్టుకున్న కుక్కలను ఇకపై తిరిగి వీధుల్లో వదిలిపెట్టరాదు. వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసినప్పటికీ వాటిని మిగతా 2లో..







# హైదరాబాద్‌లో భారీ సైబర్ ఆపరేషన్

55 మంది మోసగాళ్ల అరెస్ట్

అక్టోబర్‌లోనే 196 కేసులు నమోదు

బాధితులకు రూ.62.34 లక్షలు రికవరీ

స్కామ్‌లో చైనా వాసుల ప్రమేయం ఉన్నట్టు గుర్తింపు

హైదరాబాద్, ప్రజాస్వరం:

సైబర్ నేరాలను అరికట్టేందుకు నగర సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ ఫ్రాడ్‌లు, ఫేక్ ట్రేడింగ్ యాప్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లు మిగతా 2లో..



# వీళ్లేం సెలబ్రిటీలు?

రైనా, శిఖర్ ధావన్‌లపై సజ్జనార్ ఆగ్రహం

క్రికెటర్లకు చెందిన ఆస్తులను జప్తు చేసిన ఈడీ

02

# ఓట్ల చోరీ ద్వారా మోదీ ప్రధాని అయ్యారు

ఈ నిజాన్ని దేశ యువతకు ఆధారాలతో వివరిస్తా

నకిలీ ఓట్లు, నకిలీ ఫొటోలతో బీజేపీ మోసం చేస్తుంది

ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించడం లేదు

మోదీ, అమిత్ షా, ఈసీ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారు

మీడియాతో రాహుల్ గాంధీ

03





# బీఆర్ఎస్ నేతల ఇళ్లలో సోదాలు

డబ్బులు దాచారన్న వార్తలతో రెయిడ్స్

రాజకీయ కక్ష సాధింపేనన్న నేతలు

02




# వందేమాతరం ఒక మంత్రం

ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్య

150 ఏళ్ల స్మారకోత్సవాలు ఘనంగా ప్రారంభం

"భారత్ ఆత్మను ప్రతిబింబించే గేయం వందేమాతరం"

హైదరాబాద్, ప్రజాస్వరం

''వందేమాతరం'' గేయం కేవలం ఒక పాట కాదు, అది ఒక స్వప్నం, ఒక సంకల్పం, ఒక మంత్రం అని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన వందేమాతరం 150వ స్మారకోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దేశమాతకు అర్పణగా, త్యాగస్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన ఈ గేయం భారత చరిత్రలో సువర్ణాధ్యాయం అని పేర్కొన్నారు. మోదీ మాట్లాడుతూ, ''వందేమాతరం శబ్దం మనలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. భవిష్యత్తుపై కొత్త భరోసా మిగతా 2లో..



# వేమూరి కావేరి ట్రావెల్స్ యజమాని అరెస్ట్.. విడుదల

కర్నూలు బస్సు అగ్నిప్రమాదం కేసులో కీలక పరిణామం

A2 నిందితుడిగా చేర్చిన ఉలిందకొండ పోలీసులు

కోర్టులో హాజరుపరచగా రూ.10 వేల పూచీకత్తుపై విడుదల

గత నెల 24న జరిగిన ప్రమాదంలో 19 మంది సజీవ దహనం

బస్సును అక్రమంగా స్లీపర్ కోచ్‌గా మార్చారన్న ఆరోపణలు

03

# అమెరికాకు చైనా గట్టి సవాల్

ఫుజియాన్ యుద్ధ నౌక ప్రారంభం

స్వదేశీ సాంకేతికతతో అత్యాధునిక విమాన వాహక నౌక

సైనిక శక్తి విస్తరణలో బీజింగ్ మరో పెద్ద అడుగు



03



# వీధికుక్కలు కనిపించొద్దు

మొదటిపేజీ తరువాయి

మళ్లీ వాటి ప్రాంతాల్లో విడిచిపెట్టడం నిషేధమని తేల్చిచెప్పింది. ధర్మాసనం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జాతీయ రహదారుల శాఖ, స్థానిక సంస్థలు కలసి ఎనిమిది వారాల్లో ఈ చర్యలను పూర్తి చేయాలని ఆదేశించింది. రహదారులపై తిరుగుతున్న ఆలనాపాలనా లేని పశువులను కూడా షెల్టర్లకు తరలించాలని స్పష్టంచేసింది. ఇందుకు సంబంధించి హైవే గస్తీ బృందాలకు తగిన మార్గదర్శకాలు ఇవ్వాలని సూచించింది.

**ఆగస్టు 11 తీర్పును సవరించిన సుప్రీంకోర్టు**

త్రిసభ్య ధర్మాసనం పునర్విచారణ చేసింది. గత ఆగస్టు 11న జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం వీధి కుక్కల షెల్టర్ తరలింపుపై తీర్పు ఇచ్చింది. ఆ తీర్పుపై జంతు సంరక్షణ సంస్థలు, జంతు ప్రేమికులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియా లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పునర్విచారణ చేపట్టి, ఆ తీర్పును సవరించింది. తాజా ఆదేశాలతో గత తీర్పులో ఉన్న మినహాయింపులు పూర్తిగా రద్దయ్యాయి.

**బహిరంగ ప్రదేశాల్లో ఆహారం పెడితే చర్యలు తప్పవు**

వీధి కుక్కలకు బహిరంగ ప్రదేశాల్లో ఆహారం ఇవ్వడం నిషేధమని కోర్టు తేల్చిచెప్పింది. అయితే జంతు ప్రేమికుల భావాలను గౌరవిస్తూ స్థానిక సంస్థలు ప్రత్యేకంగా 'ఫీడింగ్ జోన్'లను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఆ ప్రాంతాల్లో శుభ్రత, భద్రతా చర్యలు తప్పనిసరిగా ఉండాలనీ తెలిపింది.

**రేబిస్ భయంతో ప్రారంభమైన కేసు**

ఢిల్లీ, ఎన్సీఆర్ పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతోందన్న వార్తలతో ఈ కేసు సుప్రీంకోర్టు దృష్టికి వచ్చింది. ఆ అంశాన్ని అత్యంత గంభీరంగా తీసుకున్న ధర్మాసనం ప్రజల భద్రతను కాపాడడంతో పాటు జంతువుల హక్కులను కూడా రక్షించే దిశగా ఈ తీర్పు ఇచ్చిందని న్యాయవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

**తదుపరి విచారణ జనవరి 13న**

రాష్ట్రాలు, స్థానిక సంస్థలు చర్యల వివరాలు సమర్పించాలి. ఈ కేసు తదుపరి విచారణను జనవరి 13కు వాయిదా వేసింది. అప్పటివరకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు చేపట్టిన చర్యలపై సుప్రీంకోర్టుకు సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించింది.



# హైదరాబాద్‌లో భారీ సైబర్ ఆపరేషన్

మొదటిపేజీ తరువాయి

పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అక్టోబర్ నెలలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దర్యాప్తు ఫలితంగా మొత్తం 196 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 8 రాష్ట్రాలకు చెందిన 55 మంది నిందితులను అరెస్టు చేసినట్లు శుక్రవారం పోలీసులు వెల్లడించారు. అధికారుల సమాచారం ప్రకారం, బాధితులకు రూ.62.34 లక్షలు తిరిగి అందజేశారు. అలాగే నిందితుల బ్యాంకు ఖాతాల్లో రూ.107 కోట్ల విలువైన అనుమానాస్పద లావాదేవీలను గుర్తించారు. ఈ ఆపరేషన్ ద్వారా హైదరాబాద్ సైబర్ పోలీసులు దేశవ్యాప్తంగా వ్యాపించిన సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను ఛేదించగలిగారు.

**డిజిటల్ అరెస్టు స్కామ్**

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, కొంతమంది చైనా పౌరులు "డిజిటల్ అరెస్టు" స్కామ్‌లో భాగమై ఉన్నట్లు గుర్తించారు. బాధితులను భయపెట్టి వీడియో కాల్ ద్వారా "మీపై కేసు ఉంది" అంటూ డబ్బులు బదిలీ చేయించుకునే మోసాలు ఇవే. హైదరాబాద్‌లో ఈ రకమైన ఫిర్యాదులు పెరుగుతుండటంతో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటైంది. ఒక 62 ఏళ్ల వృద్ధుడి నుంచి రూ.1.07 కోట్లు దోచుకున్న ముఠాను పోలీసులు గత నెలలో అరెస్టు చేశారు. బ్యాంకింగ్ యాప్‌లో చిన్న పొరపాటు ఉపయోగించి పెద్ద మొత్తాన్ని బదిలీ చేసినట్లు విచారణలో బయటపడింది.

**ఫోన్ మోసం, ఫేక్ ట్రేడింగ్ యాప్‌లు**

అదృశ్యమైన మొబైల్ ఫోన్ ద్వారా ముగ్గురు నిందితులు రూ.1.95 లక్షలు దోచుకున్న ఘటనలో కూడా పోలీసులు వారిని అరెస్టు చేశారు. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్‌లో పని చేస్తున్న ఓ వ్యక్తి ఫేక్ ట్రేడింగ్ యాప్ ద్వారా రూ.24.17 లక్షలు మోసం చేసిన కేసులో పట్టుబడ్డాడు. దర్యాప్తులో నిందితుల వద్ద నుంచి 31 మొబైల్ ఫోన్లు, 14 చెక్‌బుక్‌లు, 9 డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు చెప్పినట్లుగా, ఈ నేరాలు ప్రధానంగా ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లు, డిజిటల్ అరెస్టు ఫ్రాడ్‌లు, సోషల్ మీడియా దందాలు రూపంలో జరుగుతున్నాయి.

**ప్రజలకు హెచ్చరిక**

పోలీసులు ప్రజలను మరోసారి అప్రమత్తం చేస్తూ, తెలియని లింకులు, ఫేక్ యాప్‌లు, వీడియో కాల్స్ ద్వారా వచ్చే బెదిరింపులను నమ్మరాదని సూచించారు. ఎవరైనా మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్ లేదా సైబర్ క్రైమ్ పోర్టల్ ([www.cybercrime.gov.in](http://www.cybercrime.gov.in)) ద్వారా ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# వందేమాతరం ఒక మంత్రం

మొదటిపేజీ తరువాయి

కలిగిస్తుంది. ఇది మనందరినీ పురాణ ఇతిహాసాల వైపు తీసుకెళ్లి, భారతీయ సంస్కృతిలోని లోతైన ఆధ్యాత్మిక భావనను గుర్తు చేస్తుంది. ఒకే లయ, స్వరం, భావంతో సామూహికంగా వందేమాతరం ఆలపించడం హృదయాన్ని కదిలించే అనుభూతిని ఇస్తుంది'' అని అన్నారు.

**స్మారక నాణెం, స్టాంపు విడుదల**

ఈ సందర్భంగా ప్రధాని మోదీ వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా స్మారక నాణెం, పోస్టల్ స్టాంపును ఆవిష్కరించారు. "ప్రతి గీతానికి ఒక మూలభావం, ఒక సందేశం ఉంటుంది. మన వందేమాతరం మూలభావం 'భారత్, మా భారతి'. ఈ గేయం దేశమాత ఆరాధన, ఆత్మసాధన" అని పేర్కొన్నారు.

**ఏడాది పొడవునా ఉత్సవాలు**

ప్రధాని మోదీ తెలిపారు వందేమాతరం గేయం 150 ఏళ్ల వేడుకలను ఏడాది పొడవునా దేశవ్యాప్తంగా జరపాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఉత్సవాలు భారతీయులలో దేశభక్తి, ఐక్యత, త్యాగం అనే విలువలను మరింత బలపరుస్తాయని ఆయన అన్నారు.

**స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణ**

''వందేమాతరం'' గేయం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి జీవవాయువుగా నిలిచిందని మోదీ గుర్తుచేశారు. ''ఈ గేయం స్వాతంత్ర్య సమరయోధుల నోట నినాదంగా మారింది. కోట్లాది భారతీయుల రక్తంలో, ఉత్సాహంలో, త్యాగంలో ఈ గేయం ప్రతిధ్వనించింది'' అని ఆయన పేర్కొన్నారు. వందేమాతరం గేయాన్ని బంకిమ్‌చంద్ర ఛటర్జీ నవంబరు 7, 1875న రచించారు. మొదటగా ఆయన ప్రసిద్ధ నవల 'ఆనంద్ మఠ్'లో ఇది ప్రచురితమైంది. ఆ తరువాత ఇది స్వాతంత్ర్య ఉద్యమానికి నినాదంగా మారి, దేశభక్తుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంది.



**దేశవ్యాప్తంగా స్పందన**

వందేమాతరం 150 ఏళ్ల వేడుకలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, సాంస్కృతిక సంస్థలు గీతాలాపన, ప్రదర్శనలు, సదస్సులు నిర్వహించనున్నాయి. ఈ కార్యక్రమాలు కొత్త తరం యువతకు భారతీయ చరిత్రలోని స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని చేరవేయడం లక్ష్యంగా ఉంచుకున్నాయి.

**మోదీ సందేశం**

"వందేమాతరం అనేది కేవలం గేయం కాదు. అది భారతాత్మను ప్రతిబింబించే ప్రణామం, ప్రజల ఐక్యతకు ప్రతీక. ప్రతి భారతీయుడు 'వందేమాతరం' అని పలికినప్పుడల్లా, అది దేశభక్తి శబ్దంగా ప్రతిధ్వనించాలి."



# కేటీఆర్, కిషన్ రెడ్డి బ్యాడ్ బ్రదర్స్

మొదటిపేజీ తరువాయి

నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయిందని, సచివాలయం, ప్రగతి భవన్, కమాండ్ కంట్రోల్ సెంటర్ వంటివి విలాసవంతమైనవి మాత్రమేనని విమర్శించారు. ''కుమారుడిని ముఖ్యమంత్రి చేయాలని, వాస్తు సరిగా లేదని బాగున్న సచివాలయాన్ని కూల్చి కొత్తది కట్టారు. పేదలకు ఉపయోగం లేదు, కొత్త ఉద్యోగాలు రాలేదు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రతిపక్షాలు, మీడియాపై నిఘా కోసమే'' అని ఆరోపించారు. మెట్రో రైలును పదేళ్లలో ఒక్క కిలోమీటరు కూడా పొడిగించలేదని, మంజూరైన పాతబస్తీ మెట్రోను పక్కన పెట్టారని, ఎల్ అండ్ టీ నష్టాలకు బీఆర్ఎస్ కారణమని తెలిపారు.

**కిషన్ రెడ్డి, కేటీఆర్‌పై ధ్వజమెత్తిన రేవంత్**

కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావును 'బ్యాడ్ బ్రదర్స్' అంటూ విమర్శించారు. ''ఆనాడు హైదరాబాద్ అభివృద్ధికి కొట్లాడిన శశిధర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డిని 'హైదరాబాద్ బ్రదర్స్' అనేవారు. ఇప్పుడు మెట్రో విస్తరణ, మూసీ రివర్‌ఫ్రంట్, రీజినల్ రింగ్ రోడ్, ఫ్యూచర్ సిటీ, గోదావరి జలాలు (20 టీఎంసీలు) తేవడం, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లను అడ్డుకుంటున్న కిషన్ రెడ్డి, కేటీఆర్‌ను 'బ్యాడ్ బ్రదర్స్' అంటున్నారు'' అని ఆయన ఎత్తిచూపారు. వరదల సమయంలో కేంద్రం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని, కిషన్ రెడ్డి రూపాయి కూడా తీసుకురాలేదని ఆరోపించారు.

**కాంగ్రెస్ హయాంలో కొత్త చొరవలు**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నరలోనే రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని సీఎం పేర్కొన్నారు. మెట్రో విస్తరణకు రూ.43 వేల కోట్ల ప్రణాళికలు కేంద్రానికి సమర్పించామని, 30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కంటోన్మెంట్‌ శామీర్‌పేట, మేడ్చల్ ఎలివేటెడ్ కారిడార్లకు అనుమతులు తెచ్చి రూ.5 వేల కోట్లతో పనులు ప్రారంభించామని తెలిపారు. వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు అనుమతులు, కొత్తగూడెం, రామగుండం ఎయిర్‌పోర్టులకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు.

ఓఆర్ఆర్‌ను రూ.లక్ష కోట్ల ఆదాయం వచ్చే అసెట్‌ను బీఆర్ఎస్ రూ.7 వేల కోట్లకు అమ్మేసిందని, 44 చెరువులను బీఆర్ఎస్ నేతలు కబ్జా చేశారని (అంబర్‌పేటలో బతుకమ్మ కుంటను ఎడ్ల సుధాకర్ రెడ్డి ఆక్రమించారు) ఆరోపించారు. చెరువుల పునరుద్ధరణపై రాజకీయం చేస్తున్నారని, అహ్మదాబాద్‌లో సబర్మతి, యూపీలో నది ప్రక్షాళనలాగా మూసీని క్లీన్ చేస్తామని చెప్పారు.

**2047 విజన్ డాక్యుమెంట్, ఓటర్లకు విజ్ఞప్తి**

2047 నాటికి స్వాతంత్ర్యం వందేళ్లు పూర్తవుతుండగా, భవిష్యత్ ప్రణాళికలకు విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ''అభివృద్ధి పనుల్లో పేదలకు నష్టం జరిగితే ఆదుకుంటాం, ఇళ్లు కోల్పోయినవారికి కొత్త ఇళ్లు నిర్మిస్తాం. మీ ఓటు ద్వారా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందాం'' అని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. దీపావళి రోజు డ్రగ్స్ కేసులను ఉదాహరణగా చూపుతూ, గత ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపారు. కాంగ్రెస్ హయాంలోనే నగరం అభివృద్ధి చెందిందని, ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్‌ను గెలిపిస్తే పనులు వేగంగా జరుగుతాయని సీఎం నొక్కి చెప్పారు.



# వీళ్లేం సెలబ్రిటీలు?

- రైనా, శిఖర్ ధావన్‌లపై సజ్జనార్ ఆగ్రహం
- క్రికెటర్లకు చెందిన ఆస్తులను జప్తు చేసిన ఈడీ

హైదరాబాద్, ప్రజాస్వరం

ప్రముఖ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌పై హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ అసహనం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో వీరికి చెందిన రూ. 11 కోట్ల ఆస్తులను ఈడీ జప్తు చేసింది. ఈ మేరకు వార్తా కథనాన్ని తన సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా పంచుకున్న సజ్జనార్, "వీళ్ళేం సెలబ్రిటీలు?" అంటూ వ్యాఖ్యానించారు. అభిమానాన్ని కూడా సొమ్ము చేసుకునే వీరు ఆదర్శనీయమైన ఆటగాళ్లు ఎలా అవుతారని ఆయన ప్రశ్నించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ మహమ్మారికి బానిసలై ఎంతోమంది యువకులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని సజ్జనార్ ఆవేదన వ్యక్తం చేశారు. వేలాదిమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. సమాజాన్ని ఛిద్రం చేస్తోన్న బెట్టింగ్ భూతాన్ని ప్రోత్సహించిన ఈ క్రికెటర్లు కూడా బాధ్యులేనని ఆయన అభిప్రాయపడ్డారు. సమాజానికి మేలు చేయడానికి, యువత ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి సెలబ్రిటీలు మంచి మాటలు చెప్పాలని హితవు పలికారు. అభిమానించే వారిని తప్పుదోవ పట్టించి, వారి ప్రాణాలను తీయడానికి కారణం కావొద్దని సూచించారు.

# బీఆర్ఎస్ నేతల ఇళ్లలో సోదాలు

- డబ్బులు దాచారన్న వార్తలతో రెయిడ్స్
- రాజకీయ కక్ష సాధింపేనన్న నేతలు

హైదరాబాద్, ప్రజాస్వరం

హైదరాబాద్ నగరంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేతల ఇళ్లలో ఇటీవల ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సోదాలు చేపట్టారు. మోతీనగర్‌లోని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నివాసంలో, అలాగే రెహమత్ నగర్లోని ఎమ్మెల్సీ రవీందర్‌రావు ఇంట్లో ఎన్నికల అధికారులు విశేష తనిఖీలను నిర్వహించారు. సోదాలు జరగడానికి కారణంగా, ఈ నేతల ఇళ్లలో ఎన్నికల కోసం భారీగా నగదు నిల్వ చేసినట్లు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఈ ఫిర్యాదులపై స్పందిస్తూ, ఎన్నికల అధికారులు, అవసరమైతే కేంద్ర బలగాలను కూడా పిలుస్తూ సోదాలు చేపట్టడం జరిగింది. దీంతో నగరంలో రాజకీయ వాతావరణం కాస్త ఉద్వేగంగా మారింది. ఎన్నికల సంఘం ప్రకారం, ఫ్లయింగ్ స్క్వాడ్ సోదాలు సాధారణంగా ఎన్నికల ప్రామాణికతను రక్షించడానికి, ఎక్కడైనా అక్రమం జరిగినట్లయితే దానిని గుర్తించడానికి నిర్వహించబడతాయి. ఈ సందర్భంలో, మేము చూసిన విధంగా, కేంద్ర బలగాలు కూడా సోదాల్లో పాల్గొనడం, ఈ చర్యల గంభీరతను సూచిస్తుంది. పరిశీలకులు, ఈ సోదాలను రాజకీయంగా కాకుండా, ఎన్నికల నియమాల ప్రకారం రాబడిన సాధారణ చర్యగా చూడాలని సూచిస్తున్నారు. అయినప్పటికీ, బహిరంగంగా ఈ ఘటనపై పార్టీలు, నేతల రియాక్షన్‌లు కొనసాగుతున్నాయి, ఇది నగరంలో రాజకీయ చర్చలకు దారి తీసింది.



**ఈ సోదాలు సాధారణమే.. రాజకీయ కక్ష ఏమీ లేదు: పొన్నం**

ఈ సోదాలపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ "ఎవరైనా ఇంట్లో ఎన్నికల అధికారులు తనిఖీలు చేయవచ్చు. ఇది పూర్తిగా *ఎన్నికల సంఘం* పరిధిలో జరుగుతుంది. ఎవరైనా పై ఫిర్యాదులు ఉంటే, ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా సోదాలు చేయడం ఎన్నికల సంఘం హక్కు," అని ఆయన వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రతీ సోదా ఘటనను రాజకీయంగా మలచడం గులాబీ పార్టీ నేతలకు అలవాటు అవుతుందని విమర్శించారు. "ఎన్నికల ప్రక్రియలో అధికారులు తమ విధులు చేపడతారు. దీన్ని రాజకీయ కోణంలో చూసి ప్రతికూలంగా మలచడం అనవసరం," అని ఆయన జోస్యం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలపైనా మంత్రి వ్యాఖ్యానించారు. ఆయన చెప్పినట్లుగా, ఈ నియోజకవర్గంలో 10,000 ఓట్లు కూడా బీజేపీకి రాలేదని, కిషన్‌రెడ్డి నియోజకవర్గంలో భాజపాకు ఎలాంటి ప్రజాస్వీకారం లేనట్టుగా స్పష్టమైందని అన్నారు. ఈ నేపథ్యంలో, భాజపాభారత రాష్ట్ర సమితి మధ్యలో ఈ ఎన్నికల్లో లోపాయికారి ఒప్పందం జరిగినట్లు ఆయన ధ్వజమెత్తారు. మొత్తానికి, మంత్రి వ్యాఖ్యల ప్రకారం, హైదరాబాద్‌లోని సోదాలు ఎన్నికల నియమాల కిందే జరుగుతున్న సాధారణ చర్యలుగా చూడవలసినవి. అయితే రాజకీయ పార్టీలు, నేతలు ప్రతీ అంశాన్ని రాజకీయ కోణంలో మలచడమే కాకుండా, మీడియా ద్వారా ప్రజా దృష్టిని ఆకర్షించడంలోనూ ఉన్నారు. ఈ నేపథ్యంలోని వాదనలు, ఫలితాలు మరియు రాజకీయ సంభావ్య ప్రభావాలను విశ్లేషకులు గమనిస్తున్నారు.

# అమెరికాకు చైనా గట్టి సవాల్

- ఫుజియాన్ యుద్ధ నౌక ప్రారంభం
- స్వదేశీ సాంకేతికతతో అత్యాధునిక విమాన వాహక నౌక
- సైనిక శక్తి విస్తరణలో బీజింగ్ మరో పెద్ద అడుగు

హైదరాబాద్, ప్రజాస్వరం



ఆసియా సముద్ర ప్రాంతంలో తన ఆధిపత్యాన్ని బలపరచేందుకు చైనా మరో కీలక అడుగు వేసింది. అమెరికా నావికాదళానికి సమానంగా ఎదగాలనే వ్యూహంలో భాగంగా అత్యంత ఆధునికమైన విమాన వాహక నౌక ఫుజియాన్‌ని అధికారికంగా ప్రారంభించింది. పూర్తిగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఈ యుద్ధ నౌకను బుధవారం హైనాన్ ద్వీపంలోని సైనిక నౌకాశ్రయంలో అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ప్రారంభించారు. స్థానిక మీడియా ప్రకారం, ఈ సందర్భంగా జిన్‌పింగ్ నౌకలోని సాంకేతిక వ్యవస్థలను పరిశీలించి, చైనా సైన్యానికి ఇది ఒక "వ్యూహాత్మక మైలురాయి" అని పేర్కొన్నారు. దేశ రక్షణలో ఆధునికీకరణలో ఫుజియాన్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. 316 మీటర్ల పొడవు, 80,000 టన్నుల బరువు కలిగిన ఈ నౌక ఒకేసారి దాదాపు 50 విమానాలను మోసే సామర్థ్యం కలిగి ఉంది. ఇందులో ఎమాల్స్ అనే విద్యుదయస్కాంత ఆధారిత లాంచ్ వ్యవస్థను ఉపయోగించారు. ఇప్పటివరకు ఈ సాంకేతికతను అమెరికా గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ శ్రేణి విమాన వాహక నౌకల్లో మాత్రమే ఉపయోగిస్తున్నారు. చైనాకు ఇప్పటికే మూడు విమాన వాహక నౌకలు ఉన్నాయి - లియోనింగ్, షాండాంగ్, ఫుజియాన్. వీటిలో ఫుజియాన్ అత్యాధునికమైనది. అదేవిధంగా, బీజింగ్ తదుపరి నౌక టైప్004 నిర్మాణ పనులు ప్రారంభించింది. ఈ నౌకలో అణు శక్తి ఆధారిత ప్రొపల్షన్ వ్యవస్థతో పాటు ఎమాల్స్ సాంకేతికతను మరింత అభివృద్ధి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. చైనా సముద్రాధిపత్యానికి తీసుకుంటున్న చర్యలు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో ఇప్పటివరకు అమెరికా ఆధిపత్యం ఉన్నప్పటికీ, చైనా సైనిక వ్యూహాలు ఆ సమతౌల్యాన్ని మార్చే దిశగా సాగుతున్నాయి. ఫుజియాన్ ప్రారంభం చైనా నౌకాదళ శక్తి, సాంకేతికతలో స్వతంత్రత, మరియు వ్యూహాత్మక వ్యూహాలు అభివృద్ధి చెందుతున్నదనే సంకేతంగా చూడవచ్చు. ఎమాల్స్ సాంకేతికతను ఉపయోగించడం ద్వారా చైనా పెద్ద విమానాలను మరింత సమర్థవంతంగా లాంచ్ చేయగల సామర్థ్యాన్ని పొందుతుంది. తదుపరి టైప్004 యుద్ధ నౌక, అణు సామర్థ్యంతో పాటు అధునాతన ఎమాల్స్ సాంకేతికత కలిగి ఉండటం, భవిష్యత్తులో చైనా-అమెరికా మధ్య సముద్రాధిపత్య పోటీలో కీలక అంశంగా మారే అవకాశం ఉంది.



# ఓట్ల చోరీ ద్వారా మోదీ ప్రధాని అయ్యారు

- ఈ నిజాన్ని దేశ యువతకు ఆధారాలతో వివరిస్తా
- నకిలీ ఓట్లు, నకిలీ ఫొటోలతో బీజేపీ మోసం చేస్తుంది
- ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించడం లేదు
- మోదీ, అమిత్ షా, ఈసీ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారు
- మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ

హైదరాబాద్, ప్రజాస్వరం

నరేంద్ర మోదీ ఎన్నికల చోరీలతో ప్రధాన మంత్రి పదవిలోకి వచ్చారంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ వ్యవస్థీకృతంగా ఎన్నికల చోరీలకు పాల్పడుతోందని, ఈ నిజాన్ని దేశ యువత (జెన్ జీ) ముందు ఆధారాలతో సహా ఉంచుతానని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన 'హెచ్‌ఫైల్స్' మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ, "మా దగ్గర చాలా ఆధారాలున్నాయి. ఈ ప్రక్రియను మేం కొనసాగిస్తాం. నరేంద్ర మోదీ ఎన్నికలను ఎలా దొంగిలించి ప్రధాని అయ్యారో జెన్ జీ యువతకు స్పష్టంగా వివరిస్తాం. బీజేపీ ఎన్నికలను దొంగిలిస్తోంది. ఈ విషయంలో ఎలాంటి సందేహం లేదు" అని తీవ్రంగా విమర్శించారు. నకిలీ ఓట్లు, ఓటర్ల జాబితాలో నకిలీ ఫొటోలు వంటి అంశాలపై తాను చేసిన ఆరోపణలకు ఎన్నికల సంఘం (ఈసీ) నుంచి ఎలాంటి స్పందన రాలేదని రాహుల్ అన్నారు. బీజేపీ ఈసీని వెనకేసుకొస్తోందని, కానీ తాము చేసిన ఆరోపణలను మాత్రం ఖండించడం లేదని ఆయన పేర్కొన్నారు. తాము చూపుతున్న ఆధారాలన్నీ ఈసీ నుంచి సేకరించినవే అని తెలిపారు. ఓటర్ల జాబితాలో బ్రెజిల్‌కు చెందిన లారిస్సా నెరీ అనే మహిళ ఫొటోను చేర్చడం ఒక చిన్న ఉదాహరణ మాత్రమేనని రాహుల్ అన్నారు. "అసలు సమస్య నరేంద్ర మోదీ, అమిత్ షా, ఎన్నికల సంఘం కలిసి రాజ్యాంగంపై దాడి చేస్తుండటం. ఒకే వ్యక్తి బహుళ ఓట్లు వేయడం, ఒకే బూత్‌లో ఒక మహిళకు 200 ఫొటోలు ఉండటం వంటివి జరుగుతున్నాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, గుజరాత్‌లలో ఇది జరిగింది. ఇప్పుడు బీహార్‌లోనూ అదే చేయబోతున్నారు" అని రాహుల్ ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో బ్రెజిల్ మహిళ లారిస్సా నెరీ కూడా ఒక వీడియో ద్వారా స్పందించారు. "భారత్‌లో ఎన్నికల కోసం ఎవరో నా పాత ఫొటోను వాడుకుంటున్నారు. అది నేను 1820 ఏళ్ల వయసులో ఉన్నప్పటి ఫొటో. నన్ను భారతీయురాలిగా చూపి ప్రజలను మోసం చేస్తున్నారు" అని ఆమె తన వీడియోలో పేర్కొన్నారు.



# వేమూరి కావేరి ట్రావెల్స్ యజమాని అరెస్ట్... విడుదల

- కర్నూలు బస్సు అగ్నిప్రమాదం కేసులో కీలక పరిణామం
- A2 నిందితుడిగా చేర్చిన ఉలిందకొండ పోలీసులు
- కోర్టులో హాజరుపరచగా రూ.10 వేల పూచీకత్తుపై విడుదల
- గత నెల 24న జరిగిన ప్రమాదంలో 19 మంది సజీవ దహనం
- బస్సును అక్రమంగా స్లీపర్ కోచ్‌గా మార్చారన్న ఆరోపణలు

హైదరాబాద్, ప్రజాస్వరం

తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదాన్ని నింపిన కర్నూలు బస్సు అగ్నిప్రమాదం కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుల్లో ఒకరైన వేమూరి కావేరి ట్రావెల్స్ యజమాని వేమూరి వినోద్ కుమార్‌ను కర్నూలు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా, ఆయనకు బెయిల్ మంజూరు కావడంతో వెంటనే విడుదలయ్యారు. వివరాల్లోకి వెళితే, గత నెల అక్టోబర్ 24న హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న కావేరి ట్రావెల్స్‌కు చెందిన బస్సు ప్రమాదానికి గురైంది. కర్నూలు జిల్లా ఉలిందకొండ మండలం చిన్నటేకూరు వద్ద రోడ్డుపై ఆగి ఉన్న ఓ బైక్‌ను బస్సు ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘోర దుర్ఘటనలో 19 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ఈ ఘటనపై ప్రమాదం నుంచి బయటపడిన రమేష్ అనే ప్రయాణికుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో బస్సు డ్రైవర్ మిర్యాల లక్ష్మయ్యను A1 నిందితుడిగా చేర్చి ఇప్పటికే అరెస్ట్ చేశారు. తాజాగా, బస్సు యజమాని వేమూరి వినోద్ కుమార్‌ను A2 నిందితుడిగా పేర్కొంటూ అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన్ను స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి, రూ.10 వేల సొంత పూచీకత్తుపై వినోద్ కుమార్‌కు బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా, ప్రమాదానికి గురైన బస్సు విషయంలో యాజమాన్యం నిబంధనలు ఉల్లంఘించినట్లు తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. సీటింగ్ పర్మిషన్ ఉన్న బస్సును అక్రమంగా స్లీపర్ కోచ్‌గా మార్చి నడిపినట్లు అధికారులు గుర్తించారు. ఈ కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా రవాణా శాఖ అధికారులు కఠిన నిబంధనలు అమలు చేయాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.







# యావత్ భారతాన్ని ఏకం చేసింది "వందేమాతరం" గీతం

మెదక్ నవంబర్ 07 (ప్రజా స్వరం)

వందేమాతర గీతం 155 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో సామూహిక వందేమాతర గీతాలాపన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ భుజంగరావు, కలెక్టరేట్ ఏవో యూనస్, డీఈఓ రాధా కిషన్, డి ఆర్ డి ఏ పి డి శ్రీనివాసరావు, సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఇతర జిల్లా అధికారులు సిబ్బందితో కలిసి "వందే మాతరం" గీతాన్ని సామూహికంగా ఆలపించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యావత్ భారతాన్ని ఏకం చేసి భారతీయులందరి లో స్వాతంత్ర కాంక్షను రగిలించిన గీతం "వందేమాతరం" అన్నారు. ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని మరింతగా పెంపొందించేందుకు, భారతదేశ చరిత్రలో వందే మాతరం గీతానికి గల ప్రాధాన్యతను చాటి చెప్పేందుకు వీలుగా చేపడుతున్న వందేమాతరం సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ కార్యాలయం జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు






# వందేమాతర గీతాలు ఆలపించిన విద్యార్థులు

మెదక్ నవంబర్ 07 (ప్రజా స్వరం)

వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కేంద్రంలో వందేమాతర గేయం సామూహికంగా విద్యార్థిని విద్యార్థులతో ఆలాపించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ వందేమాతర గేయం రచించిన బంకించంద్ర చటర్జీ ని, స్వతంత్ర సమరయోధులను స్మరించుకోవడం జరిగిందని అన్నారు. వందేమాతర గేయం ప్రతి ఒక్కరికి రావాలని భరత దేశ యువతకి వందేమాతర గేయంలోని అర్థం తెలియాలని అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సుభాష్ గౌడ్, జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్, జిల్లా నాయకులు లోకేష్, శివ, శ్రీనివాస్, సుంకోజు రాజు, మధు, యువ మోర్చా పట్టణ అధ్యక్షులు బబ్లు, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఆకుల రాము విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.







# రహదారులపై వరి ధాన్యం అరబెట్టడం ప్రమాదకరం

**మెదక్ నవంబర్ 07 (ప్రజా స్వరం)**

కొంతమంది రైతులు వరి ధాన్యాన్ని రహదారులపై అరబెటడం వలన ఇరుకుగా మరి ప్రమాదాలు జరుగుతున్నాయనీ మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం చుట్టూ రాళ్లు పెట్టడం, బ్లాక్ పాలిథిన్ కవర్లతో కప్పడం వలన రాత్రి వేళల్లో వాహనదారులు అవి గమనించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల ఈ విధంగా ఘటనలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. రహదారులపై ధాన్యం అరబెట్టడం ప్రజల ప్రాణ భద్రతకు ముప్పు అని అన్నారు. కావున రైతులు గ్రామ పంచాయతీ ప్రాంగణాలు, ఖాళీ ప్రదేశాలు లేదా రహదారులకు దూరంగా ఉన్న సురక్షిత ప్రదేశాలను ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు.






# మేడ్చల్ లో భారీ ర్యాలీ

**మేడ్చల్ (ప్రజాస్వరం) :**

మేడ్చల్ పట్టణంలో స్థానికులు భారీ ర్యాలీ నిర్వహించారు. జాతీయ రహదారిపై నిర్మించ తలపెట్టిన ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ర్యాలీలో స్థానికులు భారీ ఎత్తున పాల్గొన్నారు. నిర్మాణ పనుల్లో జాప్యాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నాగరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు వెంటనే స్పందించి కాంట్రాక్టర్ పై తగు చర్యలు తీసుకుని పనులు పూర్తయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. నిర్మాణ పనులు ఎక్కడికి అక్కడే నిలిచిపోవడంతో జాతీయ రహదారి ఇరుకుగా మారిందని దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని దీంతో అమాయక ప్రజలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని అన్నారు. చాలామంది ప్రాణాలు పోగా మరికొందరు తీవ్ర గాయాల పాలై ఆస్పత్రుల్లో చేరిన ఘటనలు లేకపోలేదని గుర్తు చేశారు. ప్రభుత్వ పెద్దలు అధికారులు స్పందించి వెంటనే నిలిచిపోయిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులను తిరిగి ప్రారంభింపజేసి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు.





# నేడు ఘనంగా సదర్ ఉత్సవాలు

- **ముఖ్య అతిథిగా లడ్డు యాదవ్**

**మెదక్ నవంబర్ 07 (ప్రజా స్వరం)**

మెదక్ జిల్లా కేంద్రం లో నిర్వహించనున్న సదర్ ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు గండి మల్లేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రం యాదవ సంఘం ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం మెదక్ పట్టణంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లడ్డు యాదవ్ విచ్చేస్తున్నట్లు తెలిపారు. మెదక్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి, సదర్ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు గండి మల్లేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు చల్లా ప్రసాద్ యాదవ్, ఉపాధ్యక్షులు గొల్ల లక్ష్మణ్ యాదవ్, చందు యాదవ్, శేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి జంగిటి బాల్ రాజ్, పట్టణ యూత్ అధ్యక్షుడు పి. మనోజ్ యాదవ్, జిల్లా నాయకులు మల్లేష్ యాదవ్, విప్లవ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





# ఎంజేపీ గురుకులంలో ఘనంగా వందేమాతరం గీతలాపన

**పఠాన్ చెరు, నవంబర్ 7 ప్రజా స్వరం**

భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి కోట్ల మంది భారతీయుల్లో,స్ఫూర్తి నింపిన వందేమాతరం,జాతీయగీతం అని, భారతీయుల హృదయాల్లో దేశప్రేమను, రగిలించే ఉద్యమ నినాదం,వందేమాతరం, అని బీసీ గురుకుల ఎంజేపీ ఐనోల్, అల్లాదుర్గ్ గురుకుల ప్రిన్సిపాల్ స్రవంతి అన్నారు.శుక్రవారం వందే మాతరం జాతీయ గీతం150 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థులతో కలసి వందేమాతరం గీతాలాపన చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్రవంతి మాట్లాడుతూ.. వందే మాతరం జాతీయ గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంవత్సరం పొడువున అనగా నవంబర్ 7 నుండి 2026 నవంబర్ 7 వరకు స్మారక కార్యక్రమాల ద్వారా వందేమాతరం 150,వసంతాల ఉత్సవాలను జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని,వందేమాతర గీతాన్ని బంకిమ్ చంద్ర చటర్జీ గారు 1875లో రాశారు.వందే మాతరం,అంటే మాతృభూమికి వందనం, అని అర్థం.వందే మాతరం, నినాదం బ్రిటిష్ పాలనకు వ్యతిరేక పోరాటంలో ఒక స్ఫూర్తి నినాదంగా నిలిచిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏటీపీ రేఖ, ఉపాధ్యాయులు,పీడీ,పిఈటి, విద్యార్థుల తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం.. ఎంపిడిఓ వంగ ప్రీతి

**నార్సింగి నవంబర్ 07 (ప్రజా స్వరం)**



బాల్య వివాహాల నియంత్రణ కోసం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వంగ ప్రీతి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనా సదస్సులో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు బాల్య వివాహాల పై అవగాహన కల్పిస్తూ 18 సం నిండిన అమ్మాయిలకు, 21 సం పూర్తి అయిన అబ్బాయిలకు మాత్రమే పెళ్ళిళ్ళు చేయాలని అన్నారు. చిన్న వయస్సులో పెళ్ళిళ్ళు చేస్తే అనర్థాలు జరుగుతాయని, పెళ్లి, సంసారం, కుటుంబం వంటి వాటికి మానసికంగా సంసిద్ధం కావడానికి, గర్భధారణకు సరైన వయస్సు 18 సం పైనే అని అన్నారు. చిన్న వయస్సులో గర్భధారణ జరిగితే తల్లి, బిడ్డ ప్రాణాలకు ముప్పు పొంచి ఉంటుందని, చిన్న వయస్సులో జీవన విధానాల పై సరైన అవగాహన, మానసిక పరిపక్వత లేక సంసార జీవితంలో చాలా ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని, అందుకు గాను అమ్మాయి, అబ్బాయి, వారి తల్లిదండ్రులు, బంధువులు, పెళ్లి నిర్వాహకులు, మద్దతుదారులు అందరూ శిక్షార్హులు అని, వీరికి రెండు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసినా, చూసినా వెంటనే ఆ సమాచారాన్ని బాల్య వివాహ నిరోధక అధికారులకు జిల్లా స్థాయిలో అయితే జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్.డి.ఓ. ప్రాజెక్ట్ స్థాయిలో సి.డి.పి.ఓ, మండల స్థాయిలో ఎం.ఆర్.ఓ, సెక్టార్ స్థాయిలో ఐ.సి.డి.యస్ సూపర్ వైజర్, గ్రామ స్థాయిలో పంచాయతి కార్యదర్శులకు లేదా "చైల్డ్ లైన్" 1098, పోలీస్ శాఖ 100 నెంబరు పై అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గ్రేస్ బాయి, వైద్యాధికారి డాక్టర్ రవి కుమార్, ఎమ్.ఈ.ఓ గంగా బాయి, ఎస్ఐ బీమరి సృజన, ఎంపీఓ సయీద్, ఐసీడీఎస్ సూపర్వైజర్ సుజాత, అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, విజన్ సంస్థ ప్రతినిధి కండ్లకోయ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# నేడు, రేపు విద్యుత్ సరఫరా అంతరాయం

**మెదక్ నవంబర్ 07 (ప్రజా స్వరం)**

మెదక్ పట్టణం, మెదక్, హవేలీ ఘనపూర్, చిన్న శంకరంపేట, పాపన్నపేట మండలాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు మెదక్ విద్యుత్తు శాఖ ఏడీఈ మోహన్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత నాణ్యమైన, అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేసేందుకు సబ్ స్టేషన్ల లో మరమ్మతులు, విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్ల మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫెన్సింగ్, కరెంట్ తీగల మార్పులతో పాటు ట్రీ కటింగ్ తదితర పనులు చేయనున్నామని అన్నారు. ఇందులో భాగంగా మెదక్, హవేలీ ఘనపూర్, చిన్న శంకరంపేట, పాపన్నపేట మండలాల్లో శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. ఈ విషయంలో గమనించి ప్రజలు, రైతులు తమకు సహకరించాలని ఏడీఈ మోహన్ బాబు కోరారు.

# బ్రిటిష్ వారిని తరిమి కొట్టింది వందేమాతర గేయం: ఎస్ఐ సృజన

**నార్సింగి నవంబర్ 07 (ప్రజా స్వరం)**

వందే మాతర గేయం భారతీయులు అందరికీ స్ఫూర్తి మంత్రమని ఎస్ఐ బీమరి సృజన అన్నారు. వందే మాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సామూహిక గేయాలాపనలో ఎస్ఐ పాల్గొని విద్యార్థులతో కలిసి వందేమాతర గేయం ఆలపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో వందే మాతరం గేయం భారతీయులను ఏకంచేస్తూ, బ్రిటిష్ వాళ్ళను తరిమి కొట్టడానికి ఆయుధంగా మారిందని అన్నారు. మనం కూడా అదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ, మహనీయుల ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రధాన ఉపాధ్యాయుడు రవిచంద్ర మాట్లాడుతూ దేశ స్వాతంత్ర సమరంలో వందేమాతరం అంటూ ఎంతోమంది స్వాతంత్ర సమరయోధులు దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి త్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్రం అని తెలిపారు. దేశ ఐక్యత కోసం బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం నేటికి స్ఫూర్తి దాత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొని వందేమాతరం నినాదాలు చేశారు. మండల వ్యాప్త ప్రభుత్వ పాఠశాలలో వందే మాతరం గేయాలాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించగా శేరిపల్లి లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వందేమాతరం ఆకారం లో కూర్చుని చేసిన ప్రదర్శన ముఖ్య ఆకర్షణగా నిలిచింది.





# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిది

- **యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సిందం శశికాంత్.**

**దౌల్తాబాద్ నవంబర్ 7(ప్రజాస్వరం)**

ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు పెన్నిధి, అనారోగ్యబారిన పడినవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సిందం శశికాంత ్అన్నారు. శుక్రవారం రాయపోల్ మండల కేంద్రంలో లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపోల్ మండల కేంద్రానికి చెందిన గూని విజయ్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందగా కోలుకున్నాడు. అనంతరం తనకు ఆసుపత్రిలో ఖర్చయిన డబ్బులు సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం సీఎం సహాయ నిధి డబ్బులు మంజూరు చేయడం జరిగిందన్నారు. విజయ్ కి సీఎం సహాయనిధి చెక్కు అందజేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి అంటే పేద మధ్య తరగతి కుటుంబాల నిధి అని అనారోగ్యంతో భాదపడుతున్న పేద మధ్య తరుగుతుల వారికి ఆర్థిక వేసులుబాటు అవుతుందని ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేస్తుందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీఎం సహాయనిధి చెక్కుల విషయంలో అవినీతి పాల్పడిందని విమర్శించారు. మాది ప్రజా ప్రభుత్వమని దుబ్బాక నియోజకవర్గం ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సహకారంతో భాదితులకు తక్షణమే అందచేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల కార్యదర్శి తుడుం ఇంద్రకరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పాఠశాలలో వందేమాతరం గీతాలాపన



- **మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు.**

**దౌల్తాబాద్ నవంబర్ 7(ప్రజాస్వరం)**

దౌల్తాబాద్ మండలంలోని అన్ని పాఠశాలల్లో బంకించంద్ర చటర్జీ రచించినటువంటి మన జాతీయ గీతం వందేమాతరం నేటికి 150 ఏళ్ళు పురస్కరించుకుని అన్ని పాఠశాలల్లో అందరూ విద్యార్థులు ఉపాధ్యాయులు శుక్రవారం ఉదయం శుక్రవారం 10:00 గంటలకు వందేమాతరం గీతాన్ని ఆలపించారు జన్ జాతీయ గౌరవ్ పక్వరా లో దానికి సంబంధించిన అన్ని ఫోటోలను వీడియోలను అప్లోడ్ చేయడం జరిగింది దౌల్తాబాద్ మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమం ఒక పండగ వాతావరణంల జరిగింది.పిల్లల్లో ప్రజలల్లో దేశభక్తిని పెంపొందించే విధంగా ఈ కార్యక్రమం ఉంది స్వాతంత్ర సమరంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా మన సంత్ర సమయంలో మన స్వాతంత్ర సమర యోధులు ఆలకించిన వందేమాతర గీతం పుట్టి ఈరోజు 150 సంవత్సరాలు సందర్భంగా ప్రతి భారతీయుడు వందేమాతరం గేయం అలపించాలి అని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత మాత్మ జ్యోతిరావు పూలే సాంఘిక సంక్షేమ వెనుకబడిన గురుకుల పాఠశాలలతో పాటు, కేజీవీబి పాఠశాలలో జాతీయ గీతం పైన క్విజ్ పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు.



# అధ్వానంగా ఉన్న రోడ్ల మరమ్మత్తులు చేపిస్తున్న కత్తి కార్తిక గౌడ్

**దుబ్బాక, నవంబర్ 7 (ప్రజాస్వరం) :**

దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చేర్వాపూర్ రోడ్ చాలా కాలంగా అధ్వానంగా మారి గుంతల మయంగా మారిపోయింది. ఈ కారణంగా వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రోడ్డుపై ప్రయాణించే వాహనాలు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నాయి.ఈ పరిస్థితిని గమనించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తిక గౌడ్ టీమ్ కత్తి కార్తిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టారు. గుంతలు నింపి, రోడ్డుపై కాంక్రీట్ వేయించడం ద్వారా ప్రయాణికులకు సౌకర్యం కల్పించారు.స్థానిక ప్రజలు ఈ చర్యను అభినందిస్తూ, రోడ్ల సంరక్షణలో ప్రభుత్వం మరింత శ్రద్ధ వహించాలని కోరుతున్నారు.





# సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా క్విజ్ పోటీలు

**దౌల్తాబాద్ నవంబర్ 07(ప్రజాస్వరం )**

దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సత్యసాయి ట్రస్టు సిద్ధిపేట జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో, పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ గౌడ్ అధ్యక్షతన ఘనంగా క్విజ్ పోటీలు నిర్వహించబడినవి. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు నరేందర్ సమన్వయ కర్తలుగా వ్యవహరించారు. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులను ఐదు గ్రూపులుగా విభజించి, వాటికి నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, వాల్మీకి, వ్యాసుడు అనే పేర్లు ఇవ్వడం జరిగింది. ఈ క్విజ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పి వాల్మీకి గ్రూపు సభ్యులు ప్రథమ స్థానంలో నిలిచి మెరిశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీ భావం, విజ్ఞానపరమైన ఆలోచనా శక్తి పెరుగుతుందని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో చైతన్యాన్ని కలిగిస్తాయని అన్నారు. సత్యసాయి ట్రస్టు సభ్యులను ఆయన అభినందించారు. తెలుగు ఉపాధ్యాయులు నరేందర్ మాట్లాడుతూ ఇతిహాసాలు, పురాణాలు, మతసామరస్యం, పుణ్యక్షేత్రాలు వంటి అంశాలపై విద్యార్థులు చక్కగా అవగాహన సాధించారని, ఆసక్తిగా చదివి సమాధానాలు చెప్పారని తెలిపారు. సత్యసాయి ట్రస్టు వారు ఇలాంటి జ్ఞానపరమైన కార్యక్రమాలను తరచుగా నిర్వహించాలని ఆయన కోరారు. విజేతలకు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి, శివకృష్ణ మరియు ఇతర ఉపాధ్యాయ బృందం సభ్యులు పాల్గొన్నారు. ముగింపుగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, "మన తెలుగు భాష పట్ల యువతలో ఆసక్తి తగ్గిపోవడం బాధాకరం. తెలుగువారమై తెలుగు భాషపై ప్రేమ, పట్టు పెంపొందించుకోవాలి. బాల్యం నుంచే తెలుగు సాహిత్యం పట్ల మక్కువ పెంచితేనే మన భాష సజీవంగా నిలుస్తుంది" అని అన్నారు. సత్యసాయి ట్రస్టు వారు నిర్వహించే వ్యాసరచన, క్విజ్ పోటీలు విద్యార్థుల భాషా పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేస్తాయని ఆయన అభినందించారు.



# వందేమాతరం గీతం స్ఫూర్తితో మనం చైతన్యం

- **ఎంపీడీవో జేమ్లా నాయక్.**

**దౌల్తాబాద్ నవంబర్ 7(ప్రజాస్వరం)**



బ్రిటిష్ వలసవాదుల పాలనలో భారతదేశం ఉన్నప్పుడు స్వాతంత్ర్య ఉద్యమంలో దేశ ప్రజలను వందేమాతరం గీతం స్ఫూర్తితో చైతన్యం చేస్తూ ఉద్యమంలో పాల్గొనడం జరిగిందని రాయపోల్ ఎంపీడీవో జేమ్లా నాయక్ అన్నారు. శుక్రవారం రాయపోల్ మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వందేమాతరం 150 సంవత్సరాల వేడుకలు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేమాతరం గీతం 1875 సంవత్సరంలో బంకించంద్ర చటర్జీ రచించడం జరిగిందని, మొదటిసారి బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా బెంగాల్ లో వందేమాతరం గీతాన్ని ఆలపించడం జరిగిందన్నారు.స్వాతంత్ర్య ఉద్యమంలో దేశ ప్రజలను చైతన్యం చేయడానికి, దేశభక్తిని పెంపొందించడానికి వందేమాతరం గీతం దోహద పడిందన్నారు. 2025 నాటికి వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు గడిచిన సందర్భంగా దేశవ్యాప్తంగా వేడుకలు నిర్వహించి సామూహికంగా వందేమాతరం గీతం ఆలపించాలని దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్ణయం మేరకు సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశాల మేరకు రాయపోల్ మండలంలో అన్ని పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, పోలీస్ స్టేషన్ లో వందేమాతరం గీతం ఆలపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# డిసిసి బ్యాంక్–రైతుమిత్ర సేవలు

- **బ్యాంకు మేనేజర్ ఎల్లయ్య**

**దౌల్తాబాద్ నవంబర్ 7 (ప్రజాస్వరం)**

రైతుల అభివృద్ధి కోసం డిసిసి బ్యాంక్ అందిస్తున్న పలు సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ ఎల్లయ్య సూచించారు. మండల కేంద్రమైన దౌల్తాబాద్ లోని డిసిసి బ్యాంకులో కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో రైతులకు బ్యాంకు చేసే సేవలో భాగంగా వ్యవసాయ అవసరాలు, పంట సాగు, పశుసంవర్ధక రంగం, నీటిపారుదల, వ్యవసాయ యంత్రసామాగ్రి కొనుగోలు వంటి కార్యకలాపాలకు బ్యాంకు తక్కువ వడ్డీ రేట్లతో రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు.

రైతులకు అందుబాటులో ఉన్న ముఖ్యమైన సేవలు:

1. కెసిసీ (కిసాన్ క్రెడిట్ కార్డు) రుణాలుపంట సాగు కోసం తక్షణంలో అందే రుణం అవసరమైన మేరకు తిరిగి వినియోగించుకోగల సౌకర్యం2. వ్యవసాయ యంత్రసామాగ్రి రుణాలు ట్రాక్టర్లు, రోటావేటర్లు, త్రెషర్లు, స్ప్రేయింగ్ మెషీన్లు వంటి ఉపకరణాల కొనుగోలుకు రుణ సదుపాయం

3. పశుసంవర్ధక రుణాలు
పాల దూడలు, ఎద్దులు, మేకలు, గొర్రెల పెంపకానికి రుణం
పాల పరిశ్రమలు, పాల సంఘాలతో అనుసంధానం సౌకర్యం

4. సంగ్రహ గిడ్డంగి రసీదు రుణాలు
పంటను గిడ్డంగులలో ఉంచి, రైతు అనుకూల సమయంలో విక్రయం చేసుకునే వరకు రుణం పొందే అవకాశం

5. పంట బీమా పథకాలకు అవకాశంఅనుసంధానం
ప్రకృతి వైపరీత్యాల వలన నష్టపోయేవారికి భరోసా రక్షణ

6. మహిళ రైతు సమూహాలకు ప్రత్యేక రుణాలు
స్వయం సహాయక సంఘాల ద్వారా తక్కువ వడ్డీతో రుణ మంజూరు.

మేనేజర్ ఎల్లయ్య మాట్లాడుతూ "వ్యవసాయం మా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. రైతు బలపడితే గ్రామం బలపడుతుంది" అన్నారు. ప్రతి రైతు డిసిసి బ్యాంకు ఖాతా తెరిచి, బ్యాంకు అందిస్తున్న పథకాలు, సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు.






# విద్యార్థుల మేధాశక్తి ఒక ప్రయోగశాల

- **నిరంతర అభ్యాసమే విజయానికి మార్గం**
- **నైపుణ్యంతో మరింత బలం : రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ వర్మ**

**కరీంనగర్ (ప్రజాస్వరం) :**

శ్రద్ధ క్రమశిక్షణతో లక్ష్యసాధన భయం అలసటను అధికమించండిశాతవాహన యూనివర్సిటీలో రెండో స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ఛాన్స్ లర్ జిష్ణు దేవ్ వర్మ.నిరంతర అభ్యాసంతోనే విజయం సాధ్యమవుతుందని, శ్రద్ధ, క్రమశిక్షణతో లక్ష్యాన్ని చేరుకోవాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ వర్మ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శాతవాహన యూనివర్సిటీ రెండవ స్నాతకోత్సవానికి తెలంగాణ గవర్నర్, ఛాన్సలర్ జిష్ణు దేవ్ వర్మ హాజరయ్యారు. 25 మందికి పీహెచ్డీ పట్టాలతో పాటు 2018 నుంచి 2023 వరకు ప్రతిభ కనబరిచిన 161 మంది విద్యార్థులకు బంగారు పతకాలు గవర్నర్ అందజేశారు.ఈ సందర్భంగా గవర్నర్ విష్ణుదేవ్ వర్మ విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం విద్యార్థులను విజయం దిశగా తీసుకెళుతుందని అన్నారు. విద్యార్థుల మేధాశక్తియే వారి ప్రయోగశాలగా అభివర్ణించారు. విద్యార్థుల ఆలోచనలు, శ్రమ, సృజనాత్మకత వారిని సమాజంలో ముందుకు తీసుకెళ్తాయని తెలిపారు. అవకాశం, సమానత్వం సృజనాత్మకతతో ఎదగాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయానికి విద్యా రంగాల్లో,విద్యా ప్రమాణాలు నెలకొల్పాలని తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయానికి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ దిశగా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి అని అన్నారువిద్యారంగం బోర్డు, చాక్ పీస్ లకే మాత్రమే పరిమితం కావద్దు అని అన్నారు ప్రస్తుతం విద్యా రంగం సాంకేతికతతో ముందుకు సాగుతుంది అని అన్నారు. డిజిటల్ లెర్నింగ్ భౌగోళిక అవరోధాలను అవకాశాల మధ్య వ్యత్యాసాలను చెరిపివేసిందని తెలిపారు. ప్రతీ విద్యార్థి నైపుణ్యం, నిరంతర అభ్యాసాలె విజయానికి దోహదం చేస్తాయని అన్నారు. ప్రపంచ విజ్ఞానాన్ని ఆహ్వానించాలని, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందిపుచుకోవాలి అని వివరించారు. తెలంగాణ మట్టి పరిమళాన్ని మరువవద్దని పిలుపునిచ్చారు.అందరూ సమానంగా జీవించే సమాజమే నిజమైన అభివృద్ధి అని తెలిపారు. ప్రతిభ ఎక్కడైనా వికసిస్తుందని,భయాన్ని, అలసటను అధికమించి ముందుకు సాగాలని అన్నారు. కృషి తో ప్రతీ విద్యార్థి అభివృద్ధి సాధ్యమే అని అన్నారు. విద్యార్థి దశ నుండే సేవా మార్గాన్నిఅనుసరించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సిలర్ జె.బి. రావు, శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ యు .ఉమేష్ కుమార్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.



# 150 సంవత్సరాల వందేమాతరం గేయం

**దుబ్బాక, నవంబర్ 7 (ప్రజాస్వరం) :**

భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రాణనాడిగా నిలిచిన వందేమాతరం గేయాన్ని 150ఏళ్ల సందర్భంగా స్మరించేందుకు ,సిద్ధార్థ కాన్సెప్ట్ స్కూల్ దుబ్బాక, ట్రస్మా దుబ్బాక ఆధ్వర్యంలో లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బకిన్ చంద్ర ఛటర్జీ గారు 1875 నవంబర్ 7న రచించిన వందేమాతరం గేయం దేశ ప్రజలకు ఐక్యత, దేశభక్తి భావనలు నూరిపోసింది. 1882లో ఆయన రచించిన 'ఆనందమఠ్' నవల ద్వారా ఈ గేయం వెలుగులోకి వచ్చింది.ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఉద్యమకారులను స్మరించుకోవడం,బకిన్ చంద్ర ఛటర్జీ రచనను దేశ నూతన తరం ముందు గౌరవప్రదంగా నిలిపే లక్ష్యంతో వందేమాతరాన్ని పాడారు. కార్యక్రమంలో ట్రస్మా దుబ్బాక మండల అధ్యక్షులు కె.రవీందర్ మాట్లాడుతూ, దేశం మొత్తం ఒక్కటే రోజు, ఒక్కటే సమయానికి వందేమాతరం గేయాన్ని పాడటం ఐక్యతకు నిదర్శనమని చెప్పారు. దేశ ప్రజలు కలిసికట్టుగా ఉంటూ, దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు .ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, మల్లికార్జున్, నర్సింలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాడిన నాయకులకు ఇదే అసలైన నివాళి అవుతుందని, ఇలా అందరూ ఆదర్శంగా కలసికట్టుగా ఉండాలని వారు పేర్కొన్నారు.



# అవార్డు లకు అడ్డాగా దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి

**దుబ్బాక , నవంబర్ 7 (ప్రజాస్వరం) :**

సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో డయాలసిస్ కేంద్రం 5 మార్చ్2023 లో 05 డయాలసిస్ బెడ్స్ తో ప్రారంభించడం జరిగింది, అప్పటి నుండి ఈరోజు వరకు 10,000 కేసులు డయాలసిస్ చేయడం జరిగినది. అపెక్స్ కిడ్నీ కేర్ ప్రవేట్ లిమిటెడ్ ముంబై వారు దుబ్బాక ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో డయాలసిస్ సేవలను గుర్తించి తెలంగాణ రాష్ట్రములోని మొత్తం డయాలసిస్ సెంటర్ల లో మన దుబ్బాక ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ మొదటి స్థానములో బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డు 2024 లో ఇవ్వడం జరిగింది. ఇప్పుడు మల్లి రెండవసారి 2025 లో రావడం జరిగింది.దీనికి కృషి చేసిన ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డా,, హేమరాజ్ సింగ్ , డయాలసిస్ ఇంచార్జి శేఖర్ మరియు డయాలసిస్ సిబ్బందిసురేష్, స్వామి,మానస,వివేక్,రమేష్ మరియు హాస్పిటల్ సిబ్బంది ఎంతో కృషి చేయటం జరిగింది.

# తాళ్లపల్లిలో ఘనంగా వందేమాతరం గేయం

- **వందేమాతరం గేయం 150 ఏళ్ల సంబరాలు**
- **విద్యార్థులకు చరిత్ర వివరించిన.**
- **దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటస్వామి గౌడ్**

**దుబ్బాక, నవంబర్ 7(ప్రజా సర్వం,)**



అక్బర్‌పేట భూంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామంలో వందేమాతరం జాతీయ గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామపంచాయతీ, ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొని దేశభక్తి ఉత్సాహంతో వందేమాతరం గేయాన్ని ఆలపించారు.ఈ సందర్భంగా దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ మాట్లాడుతూ వందేమాతరం గేయం భారత స్వాతంత్ర్య సంగ్రామానికి చిహ్నంగా నిలిచింది. ఆ గేయం దేశమంతటా భారతమాత పట్ల భక్తి, ఐక్యత, త్యాగ భావనలను కలిగించింది అన్నారు. అలాగే ఆయన విద్యార్థులకు వందేమాతరం గేయం చరిత్రను వివరిస్తూ 1875లో బంకిమ్ చంద్ర చటర్జీ గారు వందేమాతరం గేయాన్ని రచించారు. 1882లో ఆనందమఠ్ నవలలో ప్రచురించారు. 1896లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్ గారు ఈ గేయాన్ని మహాత్మా గాంధీ ఆధ్వర్యంలో మొదటిసారిగా గానం చేశారు. 1950 జనవరి 24న పార్లమెంటులో జాతీయ గేయంగా ఆమోదించి, జనవరి 26 నుంచి అధికారికంగా అమల్లోకి తెచ్చారు అని వివరించిన దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్.దేశభక్తి నినాదాలతో తాళ్లపల్లి గ్రామం మారుమోగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ అమరేష్, పాఠశాల టీచర్ పద్మ, కూడ వెళ్లి దేవస్థానం డైరెక్టర్ వెలుపుల యాదగిరి ముదిరాజ్, అంగన్వాడి టీచర్ వెంకటలక్ష్మి, ఆశ వర్కర్ కవిత, ఫీల్డ్ అసిస్టెంట్ గోపరి స్వామి, గోపరి రమేష్, కందుకూరి బాలరాజు గౌడ్, గడ్డం యాదగిరి, వెలుపుల కనకరాజు, బోడోల్ల కుమార్, వేల్పుల ఎల్లం, మంగమొళ్ళ మంజుల, పొట్టెల ఎల్లవ్వ, చౌదర్పల్లి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# గోపీనాథ్ ఆస్తులపై సీఎం రేవంత్ కేటీఆర్ మధ్య గొడవలు

- **కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**


**హైదరాబాద్ (ప్రజాస్వరం ) :**



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కమార్ మరోమారు సంచలన ఆరోపణలు చేశారు. జూబ్లిహిల్స్ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆస్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్ కన్నేశారని అన్నారు. ఆస్తి పంపకాల్లో ఇద్దరి మధ్య ఇటీవల గొడవలు వచ్చాయని గోపీనాథ్ మరణం మిస్టరీ అని స్వయానా ఆయన తల్లే ఆరోపించిందన్నారు. అయినా దీనిపై ముఖ్యమంత్రిసహా కాంగ్రెస్ నేతలెవరూ స్పందించకపోవడానికి కారణం ఇదేనని చెప్పారు. సీఎంకు నిజంగా చిత్తుశుద్ధి ఉంటే గోపీనాథ్ మరణంతోపాటు ఆస్తిపాస్తులపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలు నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు.

జూబ్లిహిల్స్ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్, పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు కొమ్ముకాస్తున్నారు...సిగ్గు చేటు. తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి పనిచేస్తున్నాయి. కూడబలుక్కునే ఒకరికొకరు తిట్టుకుంటున్నారు. మేం ప్రచార సభలకు అనుమతి కోసం దరఖాస్తు చేస్తే జాప్యం చేస్తూ చివరి నిమిషంలో రద్దు చేస్తున్నారు. ఈరోజు మీనాక్షిపురం(రహమత్ నగర్)లో సాయంత్రం సభకు పర్మిషన్ ఇవ్వాలని ఈనెల 4న దరఖాస్తు చేసుకున్నాం. నిన్నటిదాకా దీనిపై స్పందించలేదు. కానీ పొద్దున ఫోన్ చేసి అనుమతి ఇవ్వడం లేదని, వేరేచోట పెట్టుకోవాలని చెబుతున్నారు. మేం ఎక్కడ సభ పెట్టుకోవాలో కూడా వాళ్లే మాకు చెబుతున్నరంటే ఏమనాలి?. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు మాత్రం ఎక్కడ అడిగితే అక్కడ మీటింగ్ కు అనుమతి ఇస్తున్నారు. చివరి నిమిషంలో ఎక్కడైనా అనుమతి ఇచ్చినా కండీషన్లు పెడుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు డీజేలు పెట్టుకోవడానికి, హంగామా చేయడానికి మాత్రం అనుమతి ఇస్తారు. ఇదేం ద్వంద్వ వైఖరి?. బీజేపీ సభలకు అనుమతిస్తే... ఒక వర్గం ఓట్లు రావనే భయం కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు పట్టుకుంది. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు సీట్లను బీజేపీ గెలుచుకుంది. జూబ్లిహిల్స్ లో బీజేపీ గెలవకూడదనే కుట్రతోనే మా సభలకు అనుమతి ఇవ్వడం లేదు. దొంగ సర్వేల పేరుతో బీజేపీ పోటీలో లేదంటూ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. గోపీనాథ్ మరణంపై సమగ్ర విచారణ జరపాలి. గోపీనాథ్ కుటుంబ సభ్యులు, ఆసుపత్రి యాజమాన్యం స్టేట్ మెంట్లను రికార్డు చేయాలి. తన తండ్రిని చూడటానికి రావొద్దంటూ బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి పువ్వాడ అజయ్ బెదిరించినట్లు గోపీనాథ్ కొడుకే ఆరోపించారు. అయినా సీఎం రేవంత్ రెడ్డి గుండె మాత్రం కరగడం లేదు... స్పందించడం లేదు. ఎందుకంటే గోపీనాథ్ ఆస్తులపై సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి ట్విట్టర్ టిల్లు మధ్య పంపకాల యవ్వారం ఉంది. అందుకే కేసీఆర్ కుటుంబంపై ఉన్న కేసులపై విచారణ జరగడం లేదు. అరెస్టు చేయడం లేదు? గోపీనాథ్ ఆస్తిపాస్తుల పంపకాల్లో కేటీఆర్, రేవంత్ మధ్య గొడవలు స్టార్ట్ అయ్యాయి. వీటికోసమే వీరిద్దరి మధ్య పగలు, పట్టింపులు ఎక్కువయ్యాయి. గోపీనాథ్ చనిపోయాక ఆయన ఆస్తులను వీళ్లద్దరూ పంచుకున్నారు. దమ్ముంటే గోపీనాథ్ ఆస్తులెన్ని? అవన్నీ ఎటుపోయాయో చెప్పే దమ్ముందా?గోపీనాథ్ మరణం, ఆస్తుల వ్యవహారంపై విచారణ జరిపించే దమ్ము రేవంత్ రెడ్డికి ఉందా? గోపీనాథ్ మరణంపై స్వయానా తల్లి ఆరోపణలపై ఇంతవరకు కాంగ్రెస్ ఎందుకు స్పందించడం లేదు? సీఎంకు నిజంగా సంబంధం లేదని భావిస్తే..తక్షణమే గోపీనాథ్ మరణం, ఆస్తిపాస్తులపై సమగ్ర విచారణ జరిపించాలి. గోపీనాథ్ మరణం వెనుక ఏం జరిగిందో.. ఆయన ఎప్పుడు చనిపోయారు? ఎవరికి ఆలస్యంగా చనిపోయినట్లు ఆసుపత్రి యాజమాన్యం ప్రకటన చేసిందో విచారణ జరపాల్సిందే. ఎక్కడైనా ఆస్తుల పంపకాలపై కుటుంబ సభ్యులు కొట్లాడుకోవడం చూశాం. ఇక్కడ మాత్రం గోపీనాథ్ ఆస్తులపై సీఎం రేవంత్, ట్విట్టర్ టిల్లు కొట్లాడుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గోపీనాథ్ మరణంపై ఆయన అనుచరులకు, బీఆర్ఎస్ క్యాడర్ కు కూడా అనేక అనుమానాలున్నాయి. జూబ్లిహిల్స్ ఎన్నికల్లో గోపీనాథ్ అనుచరులెవరూ ప్రచారం కూడా చేయడం లేదు. ప్రజలకు వాస్తవాలు అర్ధమయ్యాయి. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో పరిస్థితులు మారిపోయాయి. బీజేపీ గెలుపు తథ్యం. సర్వే నివేదికల పేరుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ చేస్తున్న కుట్రలు ప్రజలకు అర్ధమయ్యాయన్నారు. హర్యానా ఎన్నికలుసహా అనేక ఎన్నికల్లో బీజేపీ ఓ. డిపోతుందని సర్వేలు ప్రచారం చేశాయి. ఫలితాలు అందుకు భిన్నంగా వచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు . జూబ్లిహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ గెలిస్తే. చైన్ స్నాచర్లకు, గంజాయి విక్రేతలకు, సంఘ విద్రోహ శక్తులకు అడ్డాగా మారబోతోందన్నారు.











# స్పెషల్ డ్రైవ్ లో ఆకస్మిక తనిఖీలు

**మెదక్ నవంబర్ 07 (ప్రజా స్వరం)**

నార్కోటిక్ డ్రగ్స్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మెదక్ పట్టణంలో స్పెషల్ డ్రైవ్ లో ఎస్ఐ మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాగ్ స్క్వాడ్ సిబ్బంది తో కలిసి మెదక్ మార్కెట్ లో పలు షాప్ ల పై ఆకస్మిక తనిఖీ చేశారు. బస్ స్టాండ్ లో విద్యార్థులు, ప్రజలకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలను గురించి అవగాహన కల్పించడం జరిగింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999